## 2

# “పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచుము ...”

## (మత్తయి 5:13-16)

మీరు కలిగియున్న వాటిలో విలవైనది మరియు ముఖ్యమైనది అయిన ఒక విషయం గురించినది ఈ పాఠము, ఇది ప్రతి ఒక్కరికీ ఉండేది, నాకు ఉంది, అలాగే మీకూ ఉంది. ప్రతి వ్యక్తికి ఏమున్నా లేకపోయినా ఇది ఉంటుంది. ఒకవేళ మీరు దీన్ని అమ్మివేసినా, ఇంకా ఇది మీతోనే ఉంటుంది. మీరు చనిపోయిన తరువాత కూడ ఇది బ్రతికే ఉంటుంది. నేను మాట్లాడుతున్నది మీ *ప్రభావం* గురించి.

సత్ప్రభావ ఆవశ్యకత గురించి, ఒక మంచి మాదిరి కలిగియుండడం గురించి అనేక వాక్యములు తెలియచేస్తున్నాయి.[1] మనము యేసు ప్రభుని అడుగుజాడల్లో నడిచేలా ఆయన మనకు ఒక మాదిరిని పెట్టారు (1 పేతురు 2:21; యోహాను 13:5ను చూడు). ఒక మంచి మాదిరికల జీవితాన్ని కలిగియుండుటకు పౌలు ప్రయత్నించాడు (ఫిలిప్పీయులకు 3:17ను చూడు), అలాగే తిమోతి, తీతులు ఉండునట్లు వారిని ప్రోత్సహించాడు (1 తిమోతి 4:12; తీతు 2:7). భయముతో కూడిన పవిత్ర ప్రవర్తన ద్వారా విశ్వాసులైన భార్యలు తమ భర్తలను క్రీస్తు కొరకు సంపాదించవచ్చు (1 పేతురు 3:1, 2). మన ప్రభావం యొక్క శక్తి మరియు ఉద్దేశాల గురించి ఈ పాఠములో చెప్పబడిన మాటలను ప్రోత్సహించేదిగా ఈ వాక్యమును చూస్తాం.

మునుపటి పాఠములో, ధన్యతల గురించి క్లుప్తముగా నేర్చుకున్నాం (5:3–12). యేసు ప్రభువు చెప్పిన వివరాలు పరలోక రాజ్యపు ప్రాథమిక సూత్రాలను వివరిస్తున్నాయి. నేను యౌవ్వనస్థుడిగా ఉన్నప్పుడు బాయ్ స్కౌట్స్ ఆఫ్ అమెరికాలో సభ్యుడిగా ఉండేవాడను. అందులో మేము బాయ్ స్కౌట్ నియమాలను నేర్చుకొనవలసియుండేది. ప్రతి బాయ్ స్కౌట్ కూడ నమ్మకస్థుడై, నిజాయితీపరుడై, సహాయ గుణం కలిగి, స్నేహముగా, మర్యాదగా, దయతో, వినయముగా, ధైర్యముగా, సంతోషంగా పొదుపరియైన, శుభ్రముగా, గౌరవముగా ఉండాలని అందులో పేర్కొనబడి ఉంది. ధన్యతలను “పరలోక పౌరుని శాసన విధులుగా” చెప్పవచ్చు. పరలోక రాజ్యపు పౌరుడు ఆత్మయందు దీనుడై, తన పాపములను బట్టి దుఃఖించుచు, దేవునికి లోబడి, దేవునిలో సత్సంబంధం కలిగియుండుటకు ఆశకలిగి, యితరుల పట్ల దయగలిగి, హృదయ శుద్ధి కలిగి, దేవునితో మరియు యితరులతో సమాధానము కలిగియుండుటకు ప్రయాసపడుతూ, హింసింపబడుతూ దేవునియందు ఆనందించువాడునైయుండాలి.[2]

క్రీస్తు రాజ్య పౌరులకు ఉండదగ్గ ఈ లక్షణాలన్నిటిని గమనించిన తరువాత, “ఈ లక్షణాలను కలిగియుండడం ద్వారా కలిగే లాభమేమిటి?” మరియు “యిటువంటి వ్యక్తికి గల గమ్యం లేదా ఉద్దేశం ఏమిటి?” అన్న ప్రశ్నలు మనకు తలెత్తవచ్చు. ఈ ప్రశ్నలకు తగిన జవాబును ఈ వాక్యం మనకు అందిస్తుంది. పైన చెప్పబడిన లక్షణాలను కలిగియున్నవారు “ఈ

లోకమునకు ఉప్పుగా" మరియు "ఈ లోకమునకు వెలుగైయున్నట్టుగా" అలాగే వారు చేసిన ప్రతి పని కూడ పరలోకమందున్న తండ్రి మహిమ నిమిత్తం చేసేవారుగా ఉంటారు.

ఈ పాఠములో మత్తయి 5:13-16ను పరిశీలించుదాం. తరువాత మనం నేర్చుకోవాల్సిన పాఠములను వరుసగా చూద్దాం.

## వాక్య భాగమును చూద్దాం (5:13-16)

### లోకమునకు ఉప్పు (13 వచనం)

"మీరు లోకమునకు ఉప్పయి యున్నారు" (13ఎ వచనం) అన్న మాటతో యేసు ప్రభువు తన సందేశాన్ని కొనసాగిస్తున్నారు. 13నుండి 16వ వచనాల్లో పురాతన మరియు అధునిక కాలాల్లో సర్వసామాన్యమైన ఉప్పు మరియు వెలుగును గురించి ఆయన చెబుతున్నారు. ఈ రెండు కూడ మన జీవితాల్లో ఎంతో అవసరం, "ఉప్పు మరియు వెలుగుకంటే ప్రయోజనకరమైనది మరేదియు లేదని" రోమా సెనేటర్ ప్లినీ (క్రీ.శ. 62-c. 115) వ్రాస్తున్నాడు.[3]

యేసు ప్రభువు దినాల్లో ఉప్పును అనేక విధాలుగా ఉపయోగించేవారు. యితరులు చేసిన పనికి ప్రతిగా ఉప్పును యిచ్చేవారు. కొన్ని రకాల ఔషధాలలో మరియు మంచు గడ్డను కరిగించుటకు దీనిని ఉపయోగించేవారు. లేవీయులు బలుల కోసము దీనిని ఉపయోగించేవారు (లేవీయకాండము 2:13). "ఉప్పువలన దాదాపు 14,000 రకాల ప్రయోజనాలున్నాయని ఎన్‌సైక్లోపీడియా తెలియజేస్తుంది."[4] ఏదేమైనా, ప్రభువు ఈ మాట చెబుతున్నప్పుడు ఉప్పును రుచి కలిగించేదిగా, నిలువ చేయుటకు ఉపకరించేదిగా భావించి చెప్పారని అనేకమంది భావిస్తున్నారు.

మనలో చాలమంది ఆహారమునకు రుచిని కలిగించుటకు ఉప్పును వాడుతాము. ఉప్పునకు బదులుగా మరేది వాడినను ఆహారము రుచినివ్వదు. "ఉప్పులేక యెవరైనా రుచిలేనిదాని తిందురా?" యోబు 6:6లో మనం చూస్తాం. "మీ సంభాషణ ఉప్పు వేసినట్టు ఎల్లప్పుడు రుచిగలదిగాను కృపాసహితముగాను ఉండనియ్యుడి" (కొలొస్సయులకు 4:6ఎ) అని చెబుతూ ఉప్పు యొక్క ప్రయోజనాన్ని పౌలు తెలియజేస్తున్నాడు.

తన శిష్యులు ఈ లోకమునకు ఉప్పయియున్నారని ప్రభువు తెలియజేస్తూ, తన శిష్యులను అభినందిస్తుండగా, తద్వారా ఆయన ఈ లోక స్థితిని హీనం చేసి చూపిస్తున్నారు. యేసులేని జీవితం, ఈ లోకంలో మందకొడి, రుచిలేని బోరుకొట్టే జీవితంగా ఉంటుంది. ఈ రోజుల్లో ఒక పని తరువాత మరో పని చేసుకుంటూ తీరిక లేకుండా గడుపుతున్న క్రైస్తవేతరులు తమ జీవితంలోని అగాధం గురించి ఆలోచించుటకు సమయం లేక, దానిని గుర్తించకపోతున్నారు. అయితే, ఒక రోజున వ్యాధి చేత కృంగిపోయినప్పుడు లేదా మరణమునకు సమీపముగానున్నప్పుడు తమ ఉనికే ప్రశ్నార్థమవుతుంది. యేసుతో సరియైన సంబంధం కలిగియున్నప్పుడు మాత్రమే వారి జీవితాలకు పరిపూర్ణమయిన, ఎల్లకాలం ఉండే రుచి ఉంటుంది.

"మీరు లోకమునకు ఉప్పయియున్నారని" క్రీస్తు ప్రభువు చెప్పినప్పుడు, ఆయన ఉప్పు యొక్క నిలువ ఉంచే గుణాన్ని మనసులో పెట్టుకుని ఈ మాట చెప్పారు. రిఫ్రిజిరేటరులు రాకమునుపు మాంసము పాడయిపోకుండా నిలువ ఉండడానికి ఉప్పును వాడేవారు. గలిలీయ

తీరప్రాంతంలోని మత్స్యకారులు తాము పట్టిన చేపలను ఉప్పు రాసిలో నిలువ ఉంచేవారు. ఓక్లహోమాలో నా బాల్య దినాల్లో మాంసమునకు ఉప్పును పట్టి ఉంచేవారు. యిలా కొంతకాలం పాటు మాంసం నిలువ ఉండేది. ఈ నాడు కూడ ఈ లోకమును యింకొంతకాలం నిలువ ఉండేలా చేయుటకు పాటుపడేవారు క్రైస్తవులు. కనీసం ఒక పదిమంది నీతిమంతులు సొదొమ గొమొఱ్ఱా పట్టణాలలో ఉండినా గాని అది నాశనం గాకుండా ఉండేలా చేసేవారు వీరు (ఆదికాండము 18:32ను చూడు). ఈనాడు, మనలో ఉన్న నీతిమంతులైన విశ్వాసుల ద్వారా ఈ పాపభూయిష్టమైన ఈ లోకము నాశనమును వెంటనే చవిచూడడం లేదు. ఇది పూర్తిగా నాశనం కాకముందే, పశ్చాతాపపడుటకు యింకనూ సమయం ఇవ్వబడింది (2 పేతురు 3:10).

ఈ లోకము నాశనమునకు దగ్గరగా ఉందని యేసు ప్రభుని మాటలవలన అర్థమవుతుంది. కుళ్ళిపోవడం మాంసం యొక్క సహజ గుణం. అలాగే నాశనమవడం ఈ లోకం యొక్క సహజ గుణం. ఈ లోకం ఎంతగా చెడిపోతుంది? రోమా 1:18–32 మరియు 2 తిమోతి 3:1–5ను చదవండి లేదా మీ చుట్టూ చూడండి. సమాజంలో తగ్గిన నైతిక విలువలు, నీతి నిజాయితీ లేకపోవడం, పనిలో అశ్రద్ధగా ఉండడం, దేవునిపట్ల భయం లేకపోవడం వంటి వాటిని గమనిస్తున్నా?[5] ఈ లోకం యొక్క పరిస్థితిని గమనిస్తే, ఇది బహుగా చెడిపోతుండడం అంతగా ఆశ్చర్యాన్ని కలిగించడం లేదు గాని, దీనిలో ఏ మంచి కనబడకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది అని ఒకరు అభిప్రాయపడ్డారు. ఈ లోకంలో కనబడుతున్న “కాస్త మంచి” యేసు ప్రభువు యొక్క ప్రభావం మరియు ఆయన శిష్యుల యొక్క మాదిరి ఫలితమే.

ఈ వాక్య భాగానికి తిరిగివస్తే, “ఉప్పు నిస్సారమైతే, అది దేనివలన సారము పొందును?”[6] అని మత్తయి 5:13లో చూస్తాము. యేసు ప్రభువు యొక్క ఈ ప్రశ్నను అర్థం చేసుకోవాలంటే ఆయన రోజుల్లోని ఉప్పు గురించి కొన్ని విషయాలు తెలుసుకోవాలి. మనం ఈనాడు శుద్ధిచేసి వాడుతున్న సోడియం క్లోరైడ్ వంటిది కాదు ఆనాటి ఉప్పు. “మృత సముద్రంనుండి సేకరించబడిన నీరు ఇరిగిన తరువాత మిగిలిన స్పటికమును” పాలస్తీనా ప్రజలు ఉప్పుగా వాడుకునేవారు.[7] ఈ ఉప్పులో కొన్ని రకాల రసాయనాలు, మలిన పథార్థాలు ఉండేవి. ఒకవేళ దీనికి తేను తిరిగితే, ఇది నిస్సారముగా మారిపోతుంది.[8] తరువాత మిగిలిన పథార్థానికి తక్కువ లవణ గుణం మరియు తక్కువ మొత్తంలో విలువ ఉంచగలిగిన లక్షణం ఉంటుంది. దీనిని మనం “ఉప్పదనం లేని ఉప్పుగా” భావించవచ్చు. యిక పూర్వపరాల్లోకి వెళ్తే, ధన్యతలలో ఇవ్వబడిన లక్షణాలు లేని తన రాజ్య పౌరులను గురించి ప్రభువు ఈ మాటలను చెబుతున్నారు. మనుష్యులకు, ఉప్పుకు మధ్య ఉన్న తేడా యిదే గనుక దేవుని కృతజ్ఞతలు. “ఉప్పుదనం లేని” క్రైస్తవులు తమ తప్పులను బట్టి పశ్చాతాపం పొంది, దేవునివైపు తిరిగి, తమ “ఉప్పదనాన్ని” తిరిగి పొందగలరు.

“ఉప్పుదనం లేని ఉప్పు” యొక్క ప్రయోజనమేమిటి? “అది బయట పారబోయబడి మనుష్యుల చేత త్రొక్కబడుటకేగాని మరి దేనికిని పనికి రాదు” అని ప్రభువు చెప్తున్నారు (13సి వచనం). ఏదైనా ఒక వస్తువు తన ప్రాథమిక గుణమును కోల్పోతే, అవి మరో విధంగానూ ఉపయోగపడతాయి. ఒక పువ్వు వాడిపోతే, దానిలోని అందము వాడిపోతుంది. కాని ఇది నేలపై పడి, చెత్తకుప్పలో పడి తద్వారా భూమికి సారాన్నిస్తుంది. కాని, “ఉప్పుదనం లేని ఉప్పు” విషయంలో యిలా జరుగదు. ఒకవేళ దీనిని సారవంతమైన నేలలో పారబోసినట్టయితే

ఆ నేలను ఇది నిస్సారము చేస్తుంది, "అది భూమికైనను, ఎరువుకైనను పనికిరాదు గనుక దానిని బయట పారవేయుదురు" (లూకా 14:35ఎ, బి; SEB) అని ప్రభువు మరియొక సందర్భములో తెలియజేస్తున్నారు. వారు దీనిని ఎక్కడ పారవేస్తారు? మారుమూల వీధుల్లో దీనిని పారవేస్తారు. యిక్కడ ఇది ఎటువంటి హానిచేయదు, అక్కడ యిది "మనుష్యుల చేత త్రొక్కబడుతుంది."

ఏ మాత్రం మంచి ప్రభావ్ని చూపించలేని క్రైస్తవుని ప్రభువు ఏవిధంగా వర్ణించారు? యితడు ఎందుకూ పనికి రాడని ప్రభువు చెప్తున్నారు. "నిస్సారం" అను పదమునకు గ్రీకు భాషలో వాడబడిన పదము క్రొత్త నిబంధనలో దాదాపు నాలుగుసార్లు వాడబడింది. రెండుసార్లు ఉప్పు విషయంలో ఇది వాడబడగా, "అవివేకులుగా మారడం" అన్న మాటకు సమానార్థంలో మిగతా రెండుసార్లు ఇది వాడబడుతుంది అని డి. ఏ. కార్సన్ గుర్తించాడు. "తమ జీవితంలో రుచిని కోల్పోయిన శిష్యులు తమకు తాముగా అవివేకులుగా మార్చుకుంటున్నారని ముగించడం ఏమాత్రం కష్టం కాదు" అని కార్సన్ అంటున్నారు.[9] ఎంత విచారకం!

**లోకమునకు వెలుగు (14–16 వచనాలు)**

ఉప్పు గురించిన ఉదాహరణ క్రైస్తవుని ప్రభావం యొక్క వ్యతిరేకార్థమును యిస్తుంది. 14వ వచనంలో, "క్రైస్తవుల గురించి ఎన్నడూ చెప్పబడిన అత్యద్భుత, అత్యుత్తమ వ్యాఖ్యాల్లో ఒకటిగా యిక్కడ చెప్పబడింది":[10] "మీరు ఈ లోకమునకు వెలుగైయున్నారు" (14ఎ వచనం). దేవుడు వెలుగైయున్నాడని వాక్యం తెలియజేస్తుంది: "దేవుడు వెలుగైయున్నాడు ఆయనయందు చీకటి ఎంతమాత్రము లేదు" (1 యోహాను 1:5). యేసు ప్రభువును తన గురించి తాను మాట్లాడుతూ, "నేను లోకమునకు వెలుగును" (యోహాను 8:12ఎ; 9:5ను చూడు; 12:35, 46; మత్తయి 4:16) అని తెలియజేస్తున్నాడు. ఇప్పుడు అదే పదములను ఉపయోగిస్తూ "*మీరు* లోకమునకు వెలుగైయున్నారని" ప్రభువు తన శిష్యులతో చెప్తున్నారు. దేవుని కుమారులముగా, యేసు శిష్యులముగా మనము "ఈ లోకమందు జ్యోతులవలె వెలుగుచుండాలి" (ఫిలిప్పీయులు 2:15; KJV).[11]

మనము కలిగియున్న వెలుగు మన ద్వారా వచ్చినది కాదని మనకు తెలుసు. మన శక్తి దేవునినుండి వచ్చినది. మనం కలిగి ఉన్న వెలుగు ఆయనవలన కలిగినదే! "మీరు పూర్వమందు చీకటియై యుంటిరి. ఇప్పుడైతే ప్రభువునందు వెలుగైయున్నారు" (ఎఫెసీయులకు 5:8) అని పౌలు ఎఫెసీయులకు వ్రాస్తున్నారు. "ప్రభువునందు" అనే మాటను గుర్తించండి; "ప్రభువునందు" ఉండుట వలన మాత్రమే మనము జ్యోతులముగా ఉండగలము. "నేను లోకమును వెలుగును" అని ప్రభువు చెప్పిన తరువాత, "నన్ను *వెంబడించువాడు* చీకటిలో నడువక జీవపు వెలుగు కలిగియుండునని వారితో చెప్పెను" (యోహాను 8:12; నొక్కి చెప్పింది నాది).

వెలుగు ఏం చేస్తుంది? *చీకటిని పారద్రోలుటయే* దాని ప్రాథమిక ఉద్దేశం. ప్రపంచాన్ని గురించి మత్తయి 5:14లో యేసు ప్రభువు ఏం చెప్పారు? ఈ ప్రపంచం లేదా లోకం అంధకారములో ఉందని ప్రభువు తెలియజేస్తున్నారు. లోకం ఈ విషయాన్ని ఒప్పుకోదు. "మనము ప్రకాశమానంగా వెలిగింపబడుతున్న కాలములో ఉన్నామని" చెప్పడానికి ప్రజలు అలవాటుపడిపోయారు. మానవులు ఎక్కడనుండి పుట్టారు, ఎందుకు యిక్కడ ఉన్నారు,

మరలా వీరు ఎక్కడకు వెళ్తారు అన్న ప్రశ్నలతో లోకం గందరగోళంలో పడి ఉంది. వీటన్నిటికి స్పష్టమైన జవాబులు బైబిలు గ్రంథంలో ఉన్నాయి. మానవ హృదయాలను చీకటి కమ్మేసింది. ఈ లోకమునకు వెలుగును, ప్రత్యేకించి దేవుని వాక్యాన్ని ఎరుగకుండుట ఈ చీకటికి ఒక కారణమయితే, ఆ వెలుగును ఎరిగి కూడ ఉద్దేశపూర్వకంగా దానిని తిరస్కరించడం ఈ చీకటికి మరో కారణం.

సాధ్యమైనంతవరకు ఈ చీకటిని పారద్రోలడం క్రైస్తవులుగా మనముందున్న ఒక సవాలు. యిందుకోసం, వెలుగైయున్న దేవుని వాక్యమును (కీర్తన 119:105) బోధించాలి, ప్రకటించాలి. ఏదేమైనా, వాక్యమును అభ్యసించి జీవించాలి అని ఈ వాక్య భాగం నొక్కి చెప్తుతుంది. “మంచి నడక లేని మంచి మాటలు నిష్ప్రయోజనము.”[12]

చీకటిలో మనం జ్యోతులవలె ప్రకాశించుచున్నప్పుడు లోకంలోని వారు మనల్ని అభినందిస్తారా? కొద్దిమంది అభినందిస్తారు – ఆ కొద్దిమందిని బట్టి దేవునికి కృతజ్ఞతలు – కాని అనేకమంది వ్యతిరేకిస్తారు. చీకటిని పారద్రోలడం ద్వారా కలిగే మరో ప్రయోజనం – అన్నీ బహిర్గతమవుతాయి. వెలుతురులో అన్నీ కూడ స్పష్టంగా కనబడుతాయి. “సమస్తమును ఖండింపబడి వెలుగుచేత ప్రత్యక్షపరచబడును” (ఎఫెసీయులకు 5:13ఎ) అని పౌలు వ్రాస్తున్నాడు. ఇది పాపపు నీచ స్వరూపాన్ని[13] బహిర్గతం చేస్తుంది. దీన్ని బట్టి లోకం దీన్ని అసహ్యించుకుంటుంది. యేసు యిలా తెలియజేస్తున్నారు,

> వెలుగు లోకములోనికి వచ్చెను గాని తమ క్రియలు చెడ్డవైనందును మనుష్యులు వెలుగును ప్రేమింపక చీకటినే ప్రేమించిరి. దుష్కార్యము చేయు ప్రతివాడు వెలుగును ద్వేషించును. తన క్రియలు దుష్క్రియలుగా కనబడకుండునట్లు వెలుగునొద్దకు రాడు (యోహాను 3:19, 20).

వెలుగు సంబంధులకు, చీకటి సంబంధులకు మధ్య పోరాటం తప్పనిసరిగా ఉంటుంది (ఎఫెసీయులకు 5:8) ఎందుకంటే, చీకటి సంబంధులు తమ జీవితాలను దేవుని పిల్లల జీవితాలలో పోల్చగా అవి వారిని ఖండిస్తున్నట్లుంటాయి. యిది హింసకు దారి తీస్తుంది (మత్తయి 5:10-12).

ఏదేమైనా, వెలుగు కేవలం నీచత్వమును మాత్రమే బహిర్గతం చేయదు. ఆ నీచత్వమును సరిచేసుకునే విధంగా తగిన ప్రకాశమును యిది యిస్తుంది. యిది కేవలం చీకటినే పారద్రోలడం మాత్రమే కాక. మనుష్యులు నడుచుటకు మార్గాన్ని చూపిస్తుంది. కాబట్టి “మీ వెలుగును ప్రకాశింపనియ్యుడి” (16ఎ వచనం) అని ప్రభువు తన శిష్యులను బతిమిలాడినాడు!

మన వెలుగును ప్రకాశింప చేయుటకు ఉన్న ఆవశ్యకతను నొక్కి చెప్తూ యేసు ప్రభువు రెండు ఉదాహరణలను యిచ్చారు. అందులో మొదటిది, “కొండమీద నుండు పట్టణము.” “కొండమీదనుండు పట్టణము మరుగైయుండనేరదు” (14బి వచనం) అని ఆయన చెప్తున్నారు. అప్పటి రోజుల్లో పట్టణాలను సాధారణంగా ఎత్తైయిన ప్రదేశాలలో నిర్మించేవారు. యిందుకు రెండు కారణాలుండేవి. ఒకటి వ్యవసాయం: వ్యవసాయం కొరకు సాగు భూముల వాడకాన్ని తప్పించుటకు ఇది ఉపయోగపడుతుంది. మరియొక కారణం రక్షణ: ఎత్తైయిన ప్రదేశంలో ఉండుటవలన సంరక్షించుకొనుటకు సులువుగా ఉండును. యిటువంటి పట్టణాలు అనేకం పాలస్తీనాదేశంలో ఉన్నాయి. అక్కడ ప్రభువు మాటలు

వింటున్నవారి[14] కళ్ళెదురుగా కూడ యిటువంటి పట్టణం ఒకటి ఉండియుండవచ్చు. ప్రభువు తన ప్రసంగంలో భాగంగా యిటువంటి పట్టణాన్ని చూపిస్తూ ప్రసంగించి యుండవచ్చు. ఈ ఉదాహరణ ద్వారా ప్రభువు చెప్పవచ్చిన సందేశం స్పష్టమవుతుంది: కొండమీదున్న పట్టణం ఏ రీతిగా మరుగుచేయబడదో, అలాగే క్రైస్తవుల వెలుగు కూడ మరుగుచేయబడదు, ఇది వెలుగుతూ, చీకటిని పారద్రోలుతుంది.

"మనుష్యులు దీపము వెలిగించి కుంచము క్రింద పెట్టరు గాని ..." (15ఎ వచనం) అన్న మాటలతో యేసు ప్రభువు రెండవ ఉదాహరణను ప్రారంభిస్తున్నారు. అప్పటి రోజుల్లో ఒలీవ నూనె పోసిన చిన్న గిన్నెను,[15] అది "దీపముగా" వాడుకునేవారు. సహజంగా ఇది అరచేతిలో పెట్టుకునేంత చిన్నగా ఉండేది. దీపమునకు ఒకవైపు వంపు తిరిగి దీపమును వెలిగించుటకు అవసరమగు వత్తి చివరిన ఉంటుంది.

యిక్కడ చెప్పబడిన "కుంచము" అను పదము అప్పటి రోజుల్లోని పెద్ద బుట్టను సూచిస్తుంది,[16] అయితే ఇది ఎటువంటి బుట్ట అన్న విషయం అంత ప్రాముఖ్యం కాదు. దీపమునకు పైగా ఉంటే ఒక వస్తువును గురించి ఈ ఉదాహరణ సూచిస్తుంది. మరో సందర్భంలో దీపము గురించే యేసు ప్రభువు మాట్లాడుతూ, దీనిని మంచము క్రింద (మార్కు 4:21; లూకా 8:16ను చూడు) గాని, చాటు చోటునైనను (లూకా 11:33)[17] గాని పెట్టదని చెప్పారు. 13వ వచనంలోని పదములను యిక్కడ అన్వయించినట్లయితే, దాచబడిన దీపము మనకు దేనికీ ఉపయోగపడదు. "ఉప్పుదనం లేని ఉప్పు" ఎలా పనికిరాకుండా ఉంటుందో, అలాగే "వెలుగునివ్వలేని దీపము కూడ పనికి రాదు."

ప్రజలు దీపమును వెలిగించి కుంచము క్రింద, మంచము క్రింద లేదా చాటుచోటున పెట్టక ఏమి చేస్తారు? "అది యింటనుండువారందరికి వెలుగిచ్చుటకై దీపస్తంభము మీదనే పెట్టుదురు" అని యేసు ప్రభువు చెప్తున్నారు (మత్తయి 5:15బి). దీపము వెలుగింపబడగానే చుట్టూ ప్రక్కల ప్రదేశమంతయు వెలుగుగా ఉండుటకు వీలుగా ఎత్తైయిన స్తంభముమీద దీపము ఆనుకొనుటకు వీలుగానుండేది "దీపస్తంభము." ఇది ఇనుముతోగాని, లేదా చెక్కతోగాని చేయబడియుంటుంది. ఒక్కోసారి గది అలమరలో లేదా గోడకు అమర్చబడి యుంటుంది. అప్పటి కాలంలో యింటిలో ఒకే గదియుండేది. కాబట్టి ఆ చిన్న దీపము "యింటనుండేవారికందరికి" వెలుగునిస్తుంది.

మన దీపమును వెలిగించవలసిన ఆవశ్యకతను దీని ద్వారా యేసు ప్రభువు నొక్కి చెప్తున్నారు. "మనుష్యులు మీ సత్క్రియలను చూచి ... వారి యెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి" (16ఎ, బి, డి వచనం) అని ఆయన చెప్తున్నారు. మనం చేస్తున్న పని దేవుని కొరకు అన్న విషయాన్ని యితరులు తెలిసికొనునట్లు చేయడం తప్పేమీ కాదు. ఒకవేళ మనము ఈ విధంగా చేయకపోవడం వలన వారు మనల్ని స్తుతించి మహిమపరుస్తారు. "మనుష్యులకు కనబడవలెనని వారి యెదుట మీ నీతి కార్యము చేయకుండ జాగ్రత్తపడుడి" (6:1) అన్న మాటలతో తరువాత అధ్యాయం ప్రారంభమవుతుంది. దీపము వెలిగింపబడడం ద్వారా అందరి దృష్టిని తనవైపు మళ్ళించుకోవడం దాని ఉద్దేశం కాదు గాని, దాని ద్వారా ప్రత్యక్షపరచబడిన దానిని చూడడం దాని ఉద్దేశం. చీకటి గదిలోకి వెళ్ళి దీపమును వెలిగించినప్పుడు, దీపము ఎలా వెలుగుతుండాలని దానినే గమనించడం నా ఉద్దేశం కాదు గాని, ఆ వెలుగు ద్వారా గదిలోని వస్తువులను గమనించడం నా ఉద్దేశం.

యేసు ప్రభువు చెప్పిన ప్రకారం, మన యొక్క వెలుగు ఏ విధంగా ప్రకాశించాలంటే: “మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశించాలి” (5:16; నొక్కి చెప్పింది నాది). యేసు ప్రభువు ఎన్నో అద్భుత కార్యములను జరిగించాడు. కాని, ఆయన “ఏవిధంగా చేశాడంటే,” వాటిని చూచినవారు దేవుని మహమపరిచారు (మత్తయి 9:8; 15:31ను చూడు). అపొస్తలులు తమ కార్యములు మరుగుపరచబడాలని కోరుకోలేదు. కానీ వారు “ఏ విధంగా చేశారంటే,” వాటిని చూసిన ప్రజలు క్రీస్తును అంగీకరించి దేవున్ని మహిమపరిచారు (అపొస్తలుల కార్యములు 2:43; 5:12ను చూడు). “డంబము (మత్తయి 6:1), మరియు బిడియము అన్న ఈ రెండు తీవ్రతలకు శిష్యులు దూరంగా ఉండాలి.[18] దీపము తన కాంతితో అనవసర హడావిడి చేయదు అలాగని అది దాచబడదు”[19] అని ఫ్రాంక్ ఎల్. కాక్స్ వ్రాస్తున్నాడు.

క్రైస్తవులుగా మనం ఏం చేసినా గాని, అది మనల్ను గొప్ప చేసేదిగా గాక, పరలోకమందున్న తండ్రినే మహిమపరచేదిగా ఉండాలి. “మీరేమి చేసినను, సమస్తము దేవుని మహిమ కొరకు చేయుడి” (1 కొరింథీయులకు 10:31) అని పౌలు చెప్తున్నాడు. దేవుడు మనకు అనుగ్రహించిన తలాంతులను మనం ఏవిధంగా వాడుకోవాలన్న విషయం గూర్చి తెలియజేస్తూ పేతురు ఈ మాటలను నొక్కి చెప్తున్నాడు “ఇందువలన దేవుడు అన్నిటిలోను యేసు క్రీస్తు ద్వారా మహిమపరచబడును. యుగయుగములు మహిమయు ప్రభావమును ఆయనకుండును గాక, ఆమేన్” (1 పేతురు 4:11సి).

## వాక్యమునుండి నేర్చుకొనడం

మత్తయి 5:13-16 వాక్య భాగమును పరిశీలించిన మీదట, కొన్ని అన్వయింపు మాటలను పరిశీలిద్దాం. మన వాక్య భాగంనుండి అనేక పాఠములను నేర్చుకొనవచ్చును. వాటిలో కొన్నిటిని యిక్కడ ఇస్తున్నాను. కొన్ని సారుప్యముగా ఉన్నాయిగాని, అన్నియు ప్రాముఖ్యమైనవే.

### సమాజముతో సంబంధం

“ఈ సమాజముతో మనం ఎటువంటి సంబంధం కలిగియుండాలి?” ఎన్నో ఏళ్ళనుండి క్రైస్తవులను వేధిస్తున్న ప్రశ్న ఇది. మన చుట్టూ ఉన్న ప్రపంచం రోజు రోజుకి మరింత నీచంగా, భక్తిహీనంగా మారుతున్న తరుణంలో క్రైస్తవులుగా మనం ఏం చేయాలన్న సందిగ్ధంలో ఉన్నాం. ఇందుకు జవాబుగా ఒకరు యిలా అంటున్నారు: “ఈ సమాజాన్ని విడిచిపెట్టి, ప్రపంచానికే దూరంగా ఒంటరిగా ఉండి, ఏదైన ఉంటే, కొద్దిగా కలిగియుండి దానితో జీవించండి.” కాని యేసు ప్రభువు సమాధానం ఈ విధంగా లేదు. అయిదే ఇందుకు విరుద్ధంగా, “సమాజంలోనే ఉండి, సమాజానికి ఉప్పుగా, వెలుగుగా మీరుండాలి” అని ప్రభువు చెప్తున్నారు.

### సమాజం మీద ప్రభావం

“ఈ సమాజంలో ఉండడమా? ఈ సమాజం రోజు రోజుకి పాడయిపోతూ, చీకటిలో మగ్గిపోతుంది, దీన్ని మార్చడం మనవల్ల కానేకాదు” అని కొంతమంది వాదించినా గాని, మత్తయి 5:13-16 వాక్య భాగంలో ప్రభువు చెప్పిన మాటలు ఒకవేళ నిజమే అయితే,

క్రైస్తవులు సమాజాన్ని మార్చగలరు. నమ్మకస్థులైన క్రైస్తవులు ఉప్పు మాదిరిగా ఈ సమాజంలోని ఆత్మీయ కుళ్ళును తగ్గించి యిది చెడిపోకుండా కాపాడుతూ, వెలుగు మాదిరిగా ఆత్మీయ అంధకారాన్ని పారద్రోలుతారు. మనము ఈ సమాజంలో తక్కువ వారమైనా గాని, హింసింపబడుచున్నాగాని (10-12 వచనాలు), మనము శక్తిలేనివారము కాదు అలాగే అసహాయులము కాదు.

## ప్రత్యేకులుగా ఉండాలి

మన ప్రభావం ఈ ప్రపంచం పై ఉండాలంటే, మనము ఈ ప్రపంచంలోని వారికంటే ప్రత్యేకులుగా, విభిన్నంగా ఉండాలి. మనం ప్రత్యేకంగా, "ఇహలోక మాలిన్యం మనకంటకుండా" ఉండాలి (యాకోబు 1:27). మాంసముకున్న లక్షణాలే, ఉప్పుకు కూడ ఉన్నట్టయితే, మాంసము పాడవకుండా ఇది ఆపలేదు. ఒకవేళ వెలుగు కూడ చీకటికున్న లక్ష్యణాన్నే కలిగియుంటే, ఇది చీకటిని పారద్రోలలేదు. ఈ దినాల్లో క్రైస్తవులకు, క్రైస్తవేతరులకు మధ్య వ్యత్యాసం పెద్దగా కనబడడం లేదు. పరిస్థితులకు తగ్గట్టుగా రంగులు మార్చే ఊసరివల్లిని గురించి మీరు వినే ఉంటారు. మనలో కూడ ఎంతో మంది ప్రాపంచిక పరిస్థితులకే తగ్గట్టుగా మారిపోయే "క్రైస్తవ ఊసరవల్లులు" ఉన్నారు. మనము "ఈ లోకములో ఉన్నా గాని" (యోహాను 17:11) మనము "ఈ లోకమునకు చెందినవారము కాదు" (14, 16ఎ వచనాలు).

## ధైర్యంగా ఉండాలి

యింతకు ముందు చెప్పబడిన ప్రకారం, మనల్ను మనం ఈ సమాజానికి దూరంగా వేరుపరచుకోవాలన్నది మన ప్రథమ ఉద్దేశం కాదు. యేసు ప్రభువు కాలంలో "ఎస్సేనీస్" అని తమ్మును తాము పిలుచుకొన్నవారు ఉండేవారు. వారు తమను తాము "వెలుగు పుత్రులుగా"[20] పిలుచుకునేవారు. వారు ఈ సమాజానికి దూరంగా, మృత సముద్రం పశ్చిమవైపున ఏకాంత ప్రదేశంలో జీవించేవారు.[21] అందువల్ల వారి యొక్క వెలుగు ఈ సమాజం మీద ప్రకాశించే అవకాశం లేకపోయింది. మీరు, నేను, ఇంత పని చేయాల్సిన అవసరం లేదు గాని, మనయొక్క ఉప్పు మరియు వెలుగు సంబంధ కార్యక్రమాలు మన సంఘం గోడల వరకు చేయగలిగేలా చూడాలి. "మీరు మీ సంఘములకు ఉప్పయి ఉన్నారని" ప్రభువు బోధించలేదు గాని, "మీరు ఈ లోకమునకు ఉప్పయియున్నారని" ఆయన తెలియజేశారు. ఉప్పును ఒక గిన్నిలో, మాంసమును మరో గిన్నెలో ఉంచడం ద్వారా ఉప్పు తన ప్రభావాన్ని మాంసంమీద ఏమాత్రం చూపలేదు.[22] మాంసమును నిల్వ ఉంచాలంటె, ఉప్పును మాంసముతో కలిపియుంచాలి.

సమాజం మీద మన ప్రభావాన్ని చూపాలంటే మనకు ధైర్యము అవసరం. మార్కెటులోగాని, మన స్నేహితులు, పొరుగువారితో మాట్లాడుచున్నప్పుడు, యితరులతో మనం ఉన్నప్పుడు మనం వారికి ఉప్పులాగా ఉండాలి.[23] అన్ని వేళలా, అన్ని స్థలాల్లో, మనం మన వెలుగును ప్రకాశింపజేయాలి. "నీవున్న చోటనే వెలుగును పంచు" అని చిన్న పిల్లల పాట ఒకటి ఉంది.[24] మీరున్న ఇంటిని, చుట్టు ప్రక్కల ప్రాంతాలను వెలిగించండి. మీరున్న పరిస్థితుల్లో, మీరు పని చేస్తున్న స్థలంలో, మీరు వెళ్ళుతున్న పాఠశాలలో మీ వెలుగును పంచండి. ధైర్యంగా "నీవున్న చోటనే వెలుగును పంచు."

**వ్యక్తిగత భాద్యత**

తరువాత పాఠంలో స్వతస్సిద్ధత గురించి నేర్చుకుంటాం. ప్రతి క్రైస్తవుడు కూడ ఉప్పు మరియు వెలుగు వలె ఉండాలని యేసు ప్రభువు కాంక్షిస్తున్నాడన్న విషయాన్ని ప్రస్తావించడం ఎంతో ముదావహం. మేం ఎవ్వరినీ ప్రభావితం చేయలేమని కొంతమంది భావిస్తుంటారు. నేను చెప్పే విషయాన్ని, చేస్తున్న పనులను ఎవరూ పట్టించుకోనట్లైందని కొంతమంది భావిస్తుంటాం. "స్వల్పంగా ఎంచబడ్డ వెంట్రుకకు కూడ నీడ ఉంటుంది. చిన్న గులకరాయిని, నీటిలో విసిరినప్పుడు అది ఎంతో గొప్ప అలజడిని కలిగిస్తుంది. అలాగే, ప్రతి ఒక్కరికీ ఎంతో కొంత ప్రభావం ఉంటుంది" అని జార్జ్. డబ్ల్యూ. బైలే ఎప్పుడూ అంటుంటారు.

"మీరు లోకమునకు ఉప్పయియున్నారు" మరియు "మీరు లోకమునకు వెలుగైయున్నారు" అని ప్రభువు ఎవరితో అన్నారు? ఆయన ఈ మాటలను గ్రీకు తత్వవేత్తలతోనో లేక రోమా నాయకులతోనో అనలేదు. పాలస్తీనా దేశంలోని నాగరికులు, విద్యావేత్తలతో ఆయన ఈ మాటలు చెప్పలేదు. (యూదయలోని యూదులు గలిలయులను అమాయకులు, అనాగరికులుగా భావించేవారు [యోహాను 1:46ను చూడు].) నిరక్షరాస్యులైన జాలరులు, రైతులు, గృహిణులకు యేసు ఈ మాటలను ప్రకటించారు. ప్రతి క్రైస్తవుడు, మరలా చెప్తున్నాను, *ప్రతి* క్రైస్తవుడు కూడ ఈ లోకమునకు ఉప్పు మరియు వెలుగైయున్నారని, యుండాలని యేసు ప్రభువు నొక్కి చెప్పారు. గ్రీకు మూల భాషలో 13, 14 వచనాల్లో, "మీరు" అన్న పదం నొక్కి చెప్పబడింది. తనను అనుసరించు వారికందరికీ, "*మీరు – మీరందరు మరియు మీరు మాత్రమే* – లోకమునకు ఉప్పు మరియు లోకమునకు వెలుగైయున్నారు" అని యేసు చెప్పారు.

**"ప్రమాద వివరణ చీటి"**

కొన్ని సరుకుల మీద కొన్నిసార్లు ప్రమాద వివరణ చీటి యివ్వబడుతుంది. సరుకు తయారీలో వాడబడిన పదార్థములు కొన్ని కొంతమందికి అనారోగ్యాన్ని కలిగించవచ్చు అన్న హెచ్చరిక అందులో ఉంటుంది. యేసు ప్రభువు తన అనుచరులు ఎదుర్కొనబోయే హింస గురించి ప్రస్తావించిన వెంటనే వారు ఉప్పు మరియు వెలుగుగా ఉండవలసిన ఆవశ్యకతను గురించి వివరిస్తున్నారు (5:11, 12).[25] మనం ఉప్పు మరియు వెలుగుగా ఉండడం మన భౌతిక దేహానికి ప్రమాదకరమని 11 మరియు 12 వచనాలు హెచ్చరిస్తున్నాయి. ముందుగా చెప్పిన ప్రకారం, ఈ లోకంలోని నీచత్వమును, దుర్మార్గతను వెలుగు బయట పెడుతుంది. ఇది లోకానికి ఆగ్రహాన్ని కలిగిస్తుంది. ఎందుకంటే, సహజంగానే, వెలుగు అన్నిటిని ప్రత్యేకపరుస్తుంది. అప్పుడు లోకం తను ఆగ్రహానికి, ఆవేశానికి కారణం ఏమిటో తెలుసుకుంటుంది. ఆ వెలుగులో తను తప్పులను సరిద్దిదుకోక పోగా, దీనికి కారణం అయిన వెలుగును తరిమికొట్టాలని చూస్తుంది. అంటే దీనర్థం, మనం వెలుగును దాచిపెట్టేయాలా? కాదు! మనముందున్న ప్రమాదాన్ని ఎరిగియుండి, ప్రభువు మనకిచ్చిన సవాలును స్వీకరించాలని ఆయన కోరుకుంటున్నాడు. "మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశంపనియ్యుడి."

## ముగింపు

"మీరు లోకమునకు ఉప్పయియున్నారు ... మీరు లోకమునకు వెలుగైయున్నారు" (మత్తయి 5:13, 14ఎ) అన్న యేసు ప్రభుని మాటల కంటే మిన్నయిన అభినందన లేక సవాలు మీకు, నాకు ఇది గాక ఇంకేది లేదు. యేసు ప్రభుని శిష్యులుగా చెప్పుకుంటున్నవారు ఈ ప్రపంచంలోని వారందరూ కలిసి ఈ మాటలకు సార్థకత చేకూరిస్తే మన యొక్క ప్రభావం ఈ లోకం మీద ఎంతగా ఉంటుందో ఊహించగలరా? "ఒకవేళ దేవుని సంఘము తన పిలుపుకు తగ్గట్టుగా ఒక రోజు యథార్థంగా జీవించగలిగితే రాత్రికల్లా ఈ ప్రపంచం మారి పోతుంది"[26] అని పురాతన కాలంలో ఒక మాట ఉండేది. "ఈ లోకంలో ఉప్పుగా" మరియు "ఈ లోకమునకు వెలుగుగా" మనం ఉండునట్లు దేవుడు మనకు సహాయం చేయును గాక!

---

సూచనలు

[1]ప్రభావం మరియు మాదిరి గురించి తెలియజేస్తున్న మరికొన్ని వాక్య భాగములు సామెతలు 22:1; మత్తయి 13:33; 1 కొరింథీయులకు 10:11; మరియు యాకోబు 5:10. [2]ఈ భావన విషయమై నా సోదరుడు కాయ్‌రోపర్‌కు నేను ఋణ స్థుడ్ని. (Coy Roper, "How to Find Happiness," sermon preached at Trent church of Christ, Trent, Texas, 1 January 2006.) [3]*Natural History* 31.102. Quoted in D. A. Carson, "Matthew," *The Expositor's Bible Commentary*, vol. 8 (Grand Rapids, Mich.: Regency Reference Library, Zondervan Publishing House, 1984), 138. [4]Harold Hazelip, *Discipleship*, The 20th Century Sermons Series (Abilene, Tex.: Biblical Research Press, 1977), 56. [5]మీరున్న ప్రాంతంలోని నైతిక సమస్యలకు అనుగుణంగా దీన్ని మార్చుకోండి. [6]సమాధానం లేని ప్రశ్న ఇది. ఉప్పుదనం లేని ఉప్పు దానిని మరలా ఉప్పుగా మలచలేము. [7]Harold Fowler, *Matthew I*, Bible Study Textbook Series (Joplin, Mo.: College Press, 1968), 233. [8]ఒక్కోసారి భారీ మొత్తంలో, ఉప్పును నిల్వచేసేటప్పుడు పెద్ద పెద్ద గదుల్లో నేలమీద వేస్తారు. అప్పుడు చెమ్మదనం వల్ల దాని సారం పోతుంది. [9]Carson, 139. [10]D. Martyn Lloyd-Jones, *Studies in the Sermon on the Mount*, vol. 1 (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1959), 159.

[11]వెలుగైన క్రైస్తవుల గురించి యోహాను 12:36; ఎఫెసీయులకు 5:6–14; ఫిలిప్పీయులకు 2:14–16; 1 థెస్సలొనీకయులకు 5:4–8 చూడు. [12]Rudolf Stier, *The Words of the Lord Jesus,* vol. 1, trans. William B. Pope (Philadelphia: Smith, English, and Co., 1859), 124. [13]దేవుడు తిరిగి వచ్చినప్పుడు "చీకటిలో మరుగైయున్నవి" బయలుపడతాయి. అట్టివాటిని గురించి పౌలు 1 కొరింథీయులకు 4:5లో తెలియజేస్తున్నాడు. [14]ప్రసంగం చేయబడిన కొండకు దగ్గరలో పురాతన నగరపు ఆనవాళ్ళు ఉన్నాయి. [15]KJVలో "కొవొత్తి" అని ఉంది. కానీ క్రీస్తు తరువాతి కాలంలో కొవ్వొత్తులు ప్రపంచములోకి వచ్చాయి (J. W. McGarvey, *The New Testament Commentary*, vol. 1 - *Matthew and Mark* [N.p., 1875; reprint, Delight, Ark.: Gospel Light Publishing Co., 2006], 52). NKJVలో "దీపం" అని ఉంది. [16]NASBలో "కొలత విశేషముగా" ఉంది. ఈ కొలత 8 పావులకు సమానం (7.57 లీటర్లు). (*The American Heritage Dictionary*, 4th ed. [2001], s.v. "peck.") [17]లూకా 11:33 గ్రీకులో "రహస్య స్థలంగా" ఉంది. [18]బిడియం గురించి ప్రకటన 21:8ను చూడు. [19]Frank L. Cox, *Sermon Notes on The Sermon on the Mount* (Nashville: Gospel Advocate Co., 1955), 11. [20]John R. W. Stott, *The Message of the Sermon on the Mount*, The Bible Speaks Today series (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1978), 65.

[21]మృతసముద్ర ప్రతులలో దొరికిన కుమ్రాన్ సమాజంలోనిది ఇది. [22]Clovis G. Chappell, *The Sermon on the Mount* (Nashville: Abingdon-Cokesbury Press, 1930), 127. [23]మీరున్న ప్రాంతానికి అనుగుణంగా దీనిని అన్వయించుకొనండి. [24]మీలో ప్రముఖమైన పిల్లల పాట– "ది లిటిల్ లైట్ ఆఫ్ మైన్." [25]11 మరియు 12, 13నుండి 16వరకు వచనాల్లో ద్వితీయ పురుషుడు ("నీవు") ఉపయోగించబడింది. ఇవి రెండూ కూడ యేసు యొక్క శిష్యులను ఉద్దేశించినవే. [26]Hazelip, 53.

## మోషే మరియు యేసు:
## రెండు కొండలనుండి వెలువడ్డ ఒక ప్రసంగం?

పది ఆజ్ఞలలో ఆరవ ఆజ్ఞయైన "నరహత్యను చేయవద్దు" (నిర్గమకాండము 20:13 చూడు) అన్న మాటను యేసు ప్రభువు మత్తయి 5:21లో ఉపయోగించారు. 27వ వచనంలో "వ్యభిచరింపవద్దు" (నిర్గమకాండము 20:14) అన్న ఏడవ ఆజ్ఞను ఉదహరించారు. రెండు చోట్ల కూడ "నేను చెప్పునదేమనగా" అనే మాటను (మత్తయి 5:22, 28) ఉపయోగించారు. యిది వారిద్దరి మధ్యనున్న పోలికలు, వ్యత్యాసాలు, అలాగే సీనాయి మరియు పేరు తెలియని పాలస్తీనా కొండనుండి వెలువడిన ప్రసంగంలో తేడాను చూడడానికి సహాయం చేసింది.[1]

- మోషే "వంటి ప్రవక్తగా" యేసు పిలువబడ్డాడు (ద్వితీయోపదేశకాండము 18:15; అపొస్తలుల కార్యములు 3:20, 22).
- ఇద్దరూ కొండ యెక్కారు (నిర్గమకాండము 19:20, 25; మత్తయి 5:1 చూడు).
- ప్రజలు దేవునితోనూ, తమతోటివారితోనూ ఎలా ఉండాలన్న మౌళిక సూత్రాలను దేవుని కొరకు మాట్లాడిన మోషే తెచ్చాడు (నిర్గమకాండము 20:1–17), యేసు క్రీస్తు కూడ యిలాగే నూతన నిబంధనను తెచ్చారు (మత్తయి 5; 6; 7).

ఫ్రాంక్ యల్. కాక్స్ మరికొన్ని పోలికలు, వ్యత్యాసాలాను పేర్కొంటున్నాడు, "సీనాయి పర్వతం పై భయంకర ఉరుములు పది ఆజ్ఞలను అందిస్తే, గలిలయలోని కొండపైనుండి మెల్లనైన స్వరం ధన్యతలను అందించింది."[2]

మత్తయి 5వ అధ్యాయంలో మనకింక పది ఆజ్ఞల ప్రస్తావన రాదు, కాని, పాత నిబంధనలోని కొన్ని వాక్యాలు ఉదహరింపబతాయి: "నీ శత్రువును ద్వేషించు" (43 వచనం) అన్న వాక్యానికి విరుద్ధ అర్థంగల క్రొత్త బోధన మనకు కనబడుతుంది.

మనం చెప్పుకున్న వ్యత్యాసం సీనాయ కొండపై యివ్వబడ్డ ధర్మశాస్త్రమునకు, ప్రభువు యొక్క కొండమీది ప్రసంగానికి కాదు, గాని, యిది పాత నిబంధన గురించిన ప్రజల *భావన* మరియు దేవుడు యిది ఇవ్వడంలో గల ఆయన ఉద్దేశమునకు మధ్యగల వ్యత్యాసం గురించి ప్రత్యేకించి ధర్మశాస్త్రం గురించి శాస్త్రులు, పరిసయ్యులు బోధించినది మరియు దేవుని ఉద్దేశమునకు మధ్యగల వ్యాత్యాసం గురించే.

---

సూచన

[1]వ్యత్యాసం వివరించుటకు యోహాను 1:17 వాడబడింది. [2]Frank L. Cox, *Sermon Notes on Sermon on the Mount* (Nashville: Gospel Advocate Co., 1955), 9.